# 13. ఇద్దరు యువతీశ్వరులు

రెండు సంత్సరాలయింది నేను ఉద్యోగం నుండి విరమించి. తరువాత మరే ఉద్యోగంలోను తలదూర్చలేదు.

ఉద్యోగం చేస్తున్నప్పుడు చాల సార్లు కాశీ వెళ్లాను. ఒకటి రెండు రోజులకన్న హెచ్చుగా ఉండలేదు. ఇప్పుడా పని తొందరలు లేవు. ఒక పదిరోజులు కాశీలో నా భార్యతో ఉండాలని ఉదయాన్నే, అక్కడికి చేరుకున్నాను.

మేము ఆంధ్రాశ్రమంలో దిగాము. ఎవరో భోజనఫలహారాలకు ఏర్పటు చేస్తామన్నారు. మరెవరో నగరం చూపిస్తామన్నారు. నేను వేటికి అంగీకరించలేదు. తోచిన చోట తిని, కోరిన చోట తిరిగి వద్దామని నిశ్చయించాను.

సాయంకాలం నాలుగు గంటలకు నావకాశంగా గల్లీలు తిరిగిరావాలని దంపతులం నిశ్చయించాము. మాకు మీద అంతస్తులో గది దొరికింది. గదికి తాళం వేసుకొని కిందికి వచ్చాం.

వీదివేపు వరండాలో ఒక చిన్న గది ఉంది. దానిలో కృష్ణాజినం మీద, వయసు మళ్లిన ఒకాయిన కాషాయ వస్త్రాలు ధరించి, వ్యాసపీఠం మీద గ్రంథ మొకటి ఉంచి చదువుకుంటున్నారు.

ఆయనను చూడగానే నమస్కారం చేయాలని నాకనిపించింది.

"అయ్యా! నమస్కారం. నాపేరు మూర్తి" అతనికి ఉద్దేశించి నేనన్నాను.

ఆయన చదవడం ఆపి, నన్ను నాభార్యను గదిలోకి వచ్చి కూర్చోమని సంజ్ఞ చేశారు.

మేము పక్కనే ఉన్న తుంగచాపమీద కూర్చున్నాం.

ఆయన కళ్లజోడు తుడుచుకొని అన్నారు.

"మీరు ఏ ప్రాంతాల వారు?"

"విశాఖపట్నం నుంచి వచ్చాము" అన్నాను నేను.

"చాల సంతోషం!" అన్నరాయన

"మీపేరు విద్యానంద సరస్వతిస్వామివారని మేనేజరుగారు చెప్పారు. తమ పూర్వాశ్రమం గురించి తెలుసుకోవచ్చా?" నేను సూటిగా అడిగాను.

ఆయన నవ్వి అన్నారు.

"యతీశ్వరులు తమ పూర్వాశ్రమం గురించి చెప్పుకోరు.'

ఆయనను అడగడానికి నాకేమీ ప్రశ్నలు లేకుండా పోయాయి.

ఆయనే మళ్లి చెప్పడం మొదలుపెట్టారు.

"మీరు నా ప్రస్తుతమున్న ఆశ్రమం గురించి తెలుసుకోదలిస్తే వినండి. నేను శంకరమఠానికి చెందినవాడిని. వారు మాకు అన్ని విధాల సదుపాయాలుచేస్తారు. దీక్ష తీసుకున్న దగ్గిరనుంచి మాకు భోజనం, బస, కాషాయ వస్త్రాలు, పాదుకలు మొదలైనవన్నీ సమకూర్చుతారు. దేనికి లోటు చేయరు."

"చాల గొప్పసంగతే!"

"మా భోజనం కూడ ప్రత్యేకమైనది. నాలుగు కూరలు, పచ్చళ్లు, పరమాన్నం, గారెలు ప్రతిరోజు మధ్యాహ్న భోజనానికుంటాయి. రాత్రి అల్పాహారం – ఏవిధమైన ప్రాపంచకి దృష్టిపైన మనసుంచకూడా, వేదాంత గ్రాంథాలు చదువుకోవడం, ఎవరికైనా అదే విషయం మీద చెప్పడం, మేము చేయవలసినపని."

తరువాత ఆయన భగవద్గీత మీద చెప్పడం మొదలుపెట్టారు. చాలవిషయాలు చెప్తున్నారు.

ఇంతలో, లోపలి వరండాలోకి ఒకపట్టు బట్టల వర్తకుడు వచ్చాడు. గదులలో ఉన్న ఆడవాళ్లు వరండాలోకి వచ్చి చీరలు చూస్తున్నారు.

ఆయన చెప్తున్నది నా భార్యకు బోధపడడంలేదు. ఆమె దృష్టి పట్టు చీరలమీదే ఉంది. ఈ సంగతి ఆయన గమనించారు.

సరిగ్గా అయిదవుతుంటే మరోస్వామీజీ అక్కడికి వచ్చారు. ఆశ్రమం వెనుకవేపు గదిలో ఆయన ఉంటున్నారు.

విద్యానంద సరస్వతి ఆ వచ్చిన యతీశ్వరుని నాకు పరిచయం చేశారు.

"వీరు జ్ఞానానంద సరస్వతీస్వామి – వీరు నేను ఒకరోజు దీక్షను స్వీకరించాము. శంకరమఠంలో కొన్ని మరామ్మత్తులు చేస్తున్నారు. అది ఇక్కడికి దగ్గిరలోనే ఉంది. నాకు ఆంధ్రాశ్రమంలో ముందుగదిలోను, జ్ఞానానందుల వారికి వెనుకగదిలోను శంకరమఠంవారే బస ఏర్పటు చేశారు."

నేను, నా భార్య, వచ్చిన స్వామీజీకి లేచినిలబడి నమస్కారం చేశాము.

"రోజూ గంగ ఒడ్డున సాయంకాలవేళ, మేము తిరిగి వస్తాం. మీ భార్యకు పట్టుచీరలు చూపించండి. ఆ వర్తకుడు కూడా మన ప్రాంతాలవాడే."

ఇద్దరు యతీశ్వరులు వెళ్లిపోయారు.

ఇంతవరకు ఒక యతీశ్వరుడి గురించి తెలుసుకోవాలన్న కుతూహలం, ఇద్దరి గురించి తెలుసుకోడానికి తొందరపడింది.

పట్టుచీరలు చూసిన తరువాత విశ్వేశ్వరుని దర్శనంకోసం మేము వెళ్లిపోయాం.

ఒక రెండు రోజులు యతీశ్వరుల దర్శనం చేసుకోలేదు. బిర్లామందిరానికి, విశ్వవిద్యాలయానికి వెళ్లివచ్చాం.

మూడోరోజు దశాశ్వమేధ ఘట్టం దగ్గిర, మీద పావంచాపైన, గంగనది మీద వెళ్తున్న పడవలను చూస్తూ జ్ఞానానంద సరస్వతి కనిపించారు.

మేమిద్దరం స్వామీజీకి నమస్కరించాం.

ఆయన మమ్మల్ని కొంచెం నిదానంగా చూసి, జ్ఞాపకం తెచ్చుకొని అన్నారు.

"మీరు విశాఖపట్నం నుంచి వచ్చిన వాళ్లుకదూ!"

"అవును, స్వామీజీ!" అన్నాను నేను.

"కూర్చోండి." అన్నరాయన.

అతనిపక్కనే కూర్చున్నాం.

"విద్యావంతులు ఈ సాయంకాలం మీతోరాలేదా?"

"రాలేదు. శ్రద్ధతో ఉపనిషత్తులు చదువుతున్నారు. ఆయనను విడిచిపెట్టి నేను మాత్రమే వచ్చాను.

కొంతసేపు ఆయనతో ఈ మాటలు, ఆ మాటలు ఆడిన తరువాత స్వామీజీని ప్రశ్నించాను.

"స్వామీజీ! మీరు మీ పూర్వాశ్రమం గురించి చెప్పరు. ఈ నియమానికి మీరు బద్ధులు. కాని, మరొక యతీశ్వరుల గురించి చెప్పడానికి మీకు అభ్యంతరం లేదనుకుంటాను."

ఆయన చాలసేపు ఆలోచించారు. తరువాత మెల్లిగా అన్నారు.

"నేను ఇంతవరకు ఇటువంటి ఇబ్బందిలో పడలేదు."

"క్షమించండి!" అన్నాను నేను.

"దీనిలో క్షమాపణకేమీ లేదు. వినండి."

తరువాత ఆయన విద్యానంద సరస్వతి గురించి చెప్పారు.

"పూర్వాశ్రమంలో అతనిపేరు వెంకటేశ్వరరావు. హైదరాబాదు నివాసి. చాల పేరుమోసిన సర్జను."

స్వామీజీ చాలసేపు మౌనంగా కూర్చొని, తిరిగి చెప్పడం మొదలు పెట్టారు.

"అతను కొన్నివేల ఆపరేషన్లు చేశాడు. ప్రాణాలు కాపాడాడు. అంతకన్న మరో విధంగా చెప్తే బాగుంటుంది.– ప్రాణాలు పోశాడు. పొద్దున్న తొమ్మిది గంటలనుంచి రాత్రి పన్నెండు వరకు ఆపరేషన్లు చేశాడు. ఒకొక్కప్పుడు రాత్రి రెండు గంటలవరకు ఆపరేషను థియేటరులో ఉండిపోయేవాడు. మళ్లీ ఉదయం యథాప్రకారం ఆపరేషన్లకు వచ్చేవాడు."

"నేను కూడా వారి గురించి విన్నాను. చాల గొప్ప సర్జనని మా బంధువులు చెప్పుకుంటున్నారు."

"అతని భార్య సంగీత కళాశాలకు ప్రిన్సిపాలుగా పనిచేస్తున్నారు. గొప్ప విద్వాంసురాలు. ఆ దంపతులకు ఇద్దరు కొడుకులు. వాళ్లు అమెరికాలో స్థిరపడ్డారు."

"చాల బాగుంది. మరి యన సన్యాసం ఎందుకు స్వీకరించారు?"

స్వామీజీ కొంచెం సేపు ఆలోచించి తరువాత అన్నారు.

"కొంత కాలమయి భార్యభర్తలు ఒకే ఇంటో ఉంటున్నా. కొన్ని వందలమైళ్లు దూరంగా ఉన్నటు వ్యవహరించడం మొదలుపెట్టారు. అతను తన ఆపరేషన్లలో మునిగిపోయి. ఆమె తన సంగీతంలో తన్మయత్వం చెందుతూ ఒకరికొకరు దూరమయారు. ఆపరేషనులు చేసి వచ్చిన తరువాత అతను అలిసిపోయి, వంటవాడు టేబిలు మీద పెట్టినవి తిన్ననాడు తిని. లేనినాడు ఒక గ్లాసుడు పాలుతాగి పడుక్కునేవాడు. అతని భార్య గానకచేరీలకు వెళ్లి వచ్చి అదే పని చేసేది. ఒక రోజు అతను రెండు గంటల రాత్రి వరకు ఇంటికి రాలేదు. ఆమె అతను వచ్చేవరకు వేచిఉంది. మాట మాట చిన్న జల్లులా మొదలయి చివరకు గాలివానగా మారింది. అప్పుడామెఅంది.

"మీకు అరవైఅయిదు దాటిపోయింది. ఉదయం నుండి అర్ధరాత్రి వరకు మీరు ఆపరేషన్లలో మునిగిపోతారు. ఈ పెళ్లాం ఉందన్న సంగతి మీరెప్పుడో మరచిపోయారు. మీతో సమానులైన నలుగురు సర్జనులు మీకింద పనిచేస్తున్నారు. మీకు దేనికి లోటు? మీకు వచ్చినపేరు చాలదా?? మీరు అందరి గురించి ఆలోచిస్తారు. కాని మీ గురించి ఎవరేనా ఆలోచిస్తున్నరా? నేను మీతో విసిగిపోయాను, చెప్పి చెప్పి."

ఆమె ఏడుస్తూ తనగదిలోకి వెళ్లిపోయింది.

"వెంకటేశ్వరరావు ఒక గంటవరకు ఆలోచించాడు. భోజనం చేయలేదు. కనీసంపాలు కూడా తాగలేదు. కానీ లోకంలోని రోగుల కష్టాలను మోస్తున్నాడనుకోడం ఎంత అవివేకం? తనగురించి తాను తెలుసుకోవాలి. తెలతెలవారుతుంటే, ఎవరికి చెప్పకుండా అతను స్టేషనుకి వెళ్లి కాశీకి రైలెక్కాడు."

"తరువాత?" నేను ప్రశ్నించాను.

"శంకరమఠం పరమాచార్యుల నుండి సన్యాసం స్వీకరించాడు."

అప్పటికి చీకటి పడింది. గంగ ఒడ్డున విద్యుత్ దీపాలు తేజోవంతంగా వెలుగుతున్నాయి. స్వామీజీని జగ్రత్తగా ఆంధ్రాశ్రమానికి చేర్చాను.

నా మనసు చాల బాధపడింది. డాక్టరు వెంకటేశ్వరరావు భారతదేశం అంతటికి సర్జనుల స్థానంలో నాలుగోవారు. కొన్ని వేలమందికి ప్రాణభిక్ష పెట్టారు. ఆయనకు సాటిగా

వారి అసిస్టెంట్లను సరిపోల్చడం న్యాయంకాదు. ఆయన తరువాత?" ఆ ప్రశ్న చాలదూరంలో ఉంది.

రెండు మూడు రోజులు ఏవో చూస్తున్నాను. గల్లీలలో నడుస్తున్నాను. విశ్వనాథుడిని దర్శిస్తున్నాను. కాని వెంకటేశ్వరరావు గారు నా మనసులో నిరంతరం మెదులుతూనే ఉన్నారు.

ఆ వేళ నా భార్య, కొంతమంది ఆంధ్రాశ్రమంలోని మహిళలతో మూడున్నరకే మధ్యాహ్నం బజారులకు వెళ్లింది. తెచ్చినడబ్బు, ఖర్చుపెట్టినది పద్దులు వేస్తూ కూర్చున్నాను. వాటిని పూర్తి చేసిన తరువాత కిందకు వచ్చాను. ముందు గదిలో విద్యానంద సరస్వతి కూర్చున్నారు. మరో ఇద్దరు తెలుగు వాళ్లు ఆయనకు దగ్గిరగా కూర్చున్నారు. ఆయన ఏదో వేదాంతవిషయం వాళ్లకు బోధిస్తున్నారు. ఇంతలో జ్ఞానానందస్వామి వచ్చారు. బోధనలో మునిగిన స్నేహితుడిని విడిచి ఆయన గంగ ఒడ్డుకు వెళ్లిపోయారు.

నేనొక అరగంట వరకు వరండాలో తచ్చాడాను. స్వామీజీ బోధన ముగిసింది. ఆయనలేచి దగితలుపు మూసి, దగ్గిరలోనే నిలబడిన నన్ను చూశారు.

నా భార్య బజార్లకు వెళ్లిందని తెలిసినాతో అన్నారు.

"మీరొక్కరే ఇక్కడ ఏం చేస్తారు? నాతో అలా తిరిగిరాడానికి పదండి."

నేను ఆయన వెంట గంగ ఒడ్డుకు నడిచాను. నడుస్తున్నంత సేపు యన ఏమీ మాట్లాడలేదు. సావకాశంగా పైమెట్ల మీద కూర్చున్న తరువాత అన్నారు.

"మా సీతారామయ్య గొప్ప వ్యాపారవేత్త!"

"ఎవరీ సీతారామయ్యగారు?" నేను ప్రశ్నించాను.

"అతనే, జ్ఞానానంద సరస్వతి."

"చాల గొప్ప సంగతే తెలుసుకున్నాను."

"అతను సామాన్యమైన కుటుంబం నుండి వచ్చినవాడు. పెద్ద డిగ్రీలు కూడా అతనికి లేవు. కష్టపడి పైకి వచ్చాడు. వంట నూనెల వ్యాపారంలో కొన్ని లక్షలు గణించాడు. హైదరాబాదు నగరంలో నాలుగు పెద్ద ఇళ్లు అతనికున్నాయి. రెండు సంవత్సరాలకింద అతని భార్య పోయింది. అతను కూడా నా వయసు వాడే."

"ఆయనకు కొడుకులున్నారా?"

"ముగ్గురు కొడుకులు."

"వాళ్లకు కొన్ని బాధ్యతలు అప్పగించవలసింది."

"ఆ పని అతను చేశాడు. కాని, వాళ్లు తండ్రివలే లేమిని అనుభవించలేదు. అతని నిజాయితీకాని, వ్యాపారదక్షతగాని వాళ్లకు లేవు. భార్య పోయిన తరువాత కొడుకులకు

సగం ఆస్తి ఇచ్చి, మిగిలినది ఏదో అనాథాశ్రమానికి ఇవ్వాలని అతను నిశ్చయించుకున్నాడు."

"సగం ఆస్తిఅంటే ఎంత?"

"సలభై లక్షలు. ఈ సంగతి కొడుకులకు తెలిసింది. వృథాగా కొన్ని లక్షలు మామగారు అనాథాశ్రమానికి పోస్తున్నాడని కోడళ్లు బాధపడ్డారు. భర్తలను ఆస్తి పంపకాలకు ప్రోత్సాహించారు."

"ఈ ఆస్తి పరంపరాగతంగా వస్తున్నది కాదే!"

"అతను ప్రతిపైస చెమటోడ్చి సంపాదించాడు. అందుచేత తాను కోరినట్లు అది వినియోగించుకోవచ్చు."

"మరెందుకు కొడుకులు ఆస్తికోసం పాకులాడారు?"

"ముగ్గురు కోడళ్ళు తీవ్రమైన చర్చలు జరిపారు. మూడో కోడలి తండ్రి విశ్వవిద్యాలయంలో లా ప్రొఫెసరు. అతనినిని పిలిపించి అతనిచేత ఆస్తి పంపకపు దస్తావేజులు తయారు చేయించారు. న్యాయసమ్మతంగా అది జరగవలసిన పనికాదు. అయినా అతడు ప్రయత్నిస్తానని ముందుకు వచ్చాడు."

"తరువాత."

"ఒకనాటి రాత్రి ఎనిమిది గంటలకు లా ప్రొఫెసరు సీతారామయ్య ఇంటికి వచ్చాడు. నాలుగు కబుర్లు ఆడిన తరువాత అసలు సంగతి ప్రస్తావించాడు. 'తండ్రి ఆస్తికి పిల్లలు మొదటి వారసులు. వాళ్ల తరువాత ఎవరైనా. పిల్లలు గోలపెడుతుంటే ఆస్తిని అనాథాశ్రమానికి దానం చేయడం కన్న అవివేకమైన పని మరొకటి లేదు. సీతారామయ్యగారు ఆస్తిని అనాథాశ్రమానికి బహూకరించడం కన్న తానే ఏదో ఆశ్రమంలో చేరితే బాగుంటుందేమో!'

"ఈ సలహాకు సీతామారామయ్య కోపం తట్టుకోలేక పోయాడు. పంపకం దస్తావేజును చింపి ముక్కలుగాచేసి పారేశాడు. తన గది తలుపులు మూసుకున్నాడు. ఎవరికీ తెలియకుండా స్టేషనుకు వచ్చి కాశీకోసం రైలెక్కాడు."

ప్రొఫెసరు మధుసూదనరావు గారు చాల గొప్ప మేధావి నాకు గురువులు. వారి అమ్మాయి నాకు చిన్నప్పుడు బాగా తెలుసు. దేశవిదేశాలు పర్యటించారు.

నాకు చాల విచారం కలిగింది. తిరుగుదలలో స్వామీజీతో ఏమీ మాట్లాడలేక పోయాను.

రాత్రంతా ఈ విషయం గురించే ఆలోచించారు.

ఇది జరిగిపోయిన సంగతి. తిరిగిరానిది.

మా ప్రయాణం దగ్గిర పడింది. ఇద్దరు యతీంద్రులను కలియడానికిగాని, వారితో మాట్లాడడానికిగాని అవకాశం దొరకలేదు.

ఆరోజు, రాత్రి బండికి రిజర్వేషనయింది. సాయంకాలం నేను, నా భార్య, పళ్లుకొని, ఇద్దరు స్వామీజీలతో చెప్పివద్దామని బయలు దేరాము.

స్వామి విద్యానంద సరస్వతి ఆదరంగా పలకరించారు. పక్కనే పళ్లుంచమన్నారు. ఏదో మాటలు చెప్పిన తరువాతనేనన్నాను.

"స్వామీజీ! మీరు సన్యాసాశ్రమం స్వీకరించడం వలన వేలకొలది రోగులకు మీ వైద్యం లేకుండా పోయింది. బాధలతో ఉన్న ప్రాణికోటిని రక్షించడమే మీవంటి మహావైద్యులకు ధ్యేయం. ఈ కర్తవ్యం పట్ల..."

నామాట పూర్తికాకుండానే ఆయన అన్నారు.

"ఏదో రోజు నేనీ ప్రపంచం నుండి విరమించాలి. అప్పుడు నేను లేనిలోటు ఎలాగు ఉండనే ఉంటుంది. ఆస్థితికి ఇప్పటినుంచీ లోకం ఆయత్తమవాలి."

ఆయనకు నేనేం చెప్పగలను!

చేతులు మోడ్చి దంపతులం స్వామి విద్యానంద సరస్వతికి నమస్కరించి అక్కడ నుండి వెళ్లిపోయాము.

స్వామి జ్ఞానానంద సరస్వతిగారి దగ్గిరికి వెళ్లాము. ఆయన బైటకు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఆయనకు నమస్కరించి అన్నాను.

"స్వామీ! మీరు మా గురువుగారైన ప్రొఫెసరు మధుసూదనరావు గారి వియ్యంకులని తెలిసింది. మీ మూడో కోడల్ని చిన్నప్పటి నుంచి నేనెరుగుదును. మధుసూధనరావు గారు మహామేధావి. జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రశంసలందుకున్నారు..."

ఇంకానేనేమో చెప్పబోతుంటే ఆయన వినిపించుకోలేదు. నేనక్కడ పెట్టిన పళ్లను నా ముఖంమీద విసిరేశారు.

కోపంతో ఆయన అన్నారు.

"మీ గురువు, లోకానికంతకు గోప్పవాడు. అతని కూతురు అంతకన్న ఉత్తమురాలు. ఇద్దరూ కలిసి నాతలపైన కాషాయ వస్త్రం ముసుగుకప్పారు. పో! మరేం మాట్లాడకు."

ఆయన అక్కడ నుండి వెళ్లిపోయారు.